సాక్షి మహబూబ్‌నగర్

గురువారం । 8 । మే । 2025



బైపాస్‌కు గ్రీన్‌సిగ్నల్
జడ్చర్ల బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.
వివరాలు 10లో ▸



రక్త కన్నీటి గాథ!
తల్లిపాలు తాగే వయసులోనే రక్తాన్ని ఎక్కించుకుంటూ పిల్లలు తల్లడిల్లుతున్నారు.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
40.1 /21.3

వాతావరణం
ఎండగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జైలులో సత్ప్రవర్తనతో ఉండాలి



పాలమూరు: పలు రకాల కేసుల్లో జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు పూర్తిగా సత్ప్రవర్తనతో మెలగాల్సిన అవసరం ఉందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని జిల్లా ప్రధాన జైలును బుధవారం న్యాయమూర్తి సందర్శించారు. మొదటగా ఖైదీలకు తయారు చేసే ఆహారం, వంట గది, ఖైదీలు ఉండే బ్యారక్‌లను పరిశీలించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ పనితీరును జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందుతున్న వసతులపై ప్రత్యేకంగా ఆరా తీశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ జైలు జీవితం తర్వాత ఎలాంటి తప్పులు చేయకుండా కుటుంబం కోసం ఉత్తమ జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర, జైలు సూపరింటెండెంట్ వెంకటేశం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ రవీందర్, సభ్యులు యోగేశ్వర్‌రాజ్, మల్లారెడ్డి, శివరాజ్, యాదయ్య పాల్గొన్నారు.

రైల్వే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం



జడ్చర్ల టౌన్: రైల్వే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం జడ్చర్ల రైల్వేస్టేషన్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రైల్వేలో భద్రత చర్యలు పెంచాలని, ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయవాదులు పోరాటానికి ముందుకు రావాలన్నారు. రైల్వేలో ఖాళీగా ఉన్న దాదాపు 5లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్యాసింజర్ రైళ్లను పెంచాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్‌క్లాస్, జనరల్ కంపార్ట్‌మెంట్‌లను పెంచాలన్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన రైల్వే వ్యవస్థను కేంద్రం ప్రైవేటీకరించటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తుందని, అందరం వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఖమర్ అలీ, తెలుగు సత్తయ్య, మున్నాబాయ్, కృష్ణ, సాగర్, మహేష్, పుల్లయ్య, రాంసింగ్, విజయేంద్ర యాదవ్, సురేంద్రసింగ్ పాల్గొన్నారు.

నిలకడగా ఉల్లి ధరలు

- గరిష్టంగా రూ. 1450
- కనిష్టంగా రూ. 950



దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో ఉల్లి ధరలు నిలకడగా ఉన్నాయి. ఉల్లి సీజన్ తగ్గు ముఖం పట్టడంతో మార్కెట్‌కు వేయి బస్తాల వరకు ఉల్లి అమ్మకానికి వచ్చింది. బహిరంగ వేలంలో క్వింటాల్ ఉల్లి గరిష్టంగా రూ.1450, కనిష్టంగా రూ.950గా ధరలు నమోదయ్యాయి. గరిష్ట ధర పలికిన ఉల్లి 50 కేజీల బస్తా ధర రూ.800ల వరకు విక్రయించారు. అయితే వేలం ధర కన్నా బస్తా పై రూ.75 వరకు వ్యాపారులు ఎక్కువగా తీసుకున్నారు. కనిష్టంగా బస్తా ధర రూ.500 వరకు విక్రయించారు. మార్కెట్ బయట పలువురు రైతులు ట్రాక్టర్లపై తెచ్చిన ఉల్లి బస్తాలను నేరుగా విక్రయించారు. రూ.800 నుంచి రూ.700 వరకు బస్తాగా అమ్ముకున్నారు.

ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర రూ.2,103

దేవరకద్ర/నవాబుపేట: దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం మధ్యాహ్నం జరిగిన టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,103, కనిష్టంగా రూ.1,792గా ధరలు పలికాయి. హంస ధాన్యం గరిష్టంగా రూ.1,804, కనిష్టంగా రూ.1,640గా ధరలు నమోదయ్యాయి. ఆముదాల ధర గరిష్టంగా రూ.5,859గా ఒకే ధర లభించింది. మార్కెట్‌కు దాదాపు 5 వందల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. నవాబుపేట మార్కెట్‌కు ఆర్‌ఎన్‌ఆర్, జేజేలు (1010)లు కలిసి దాదాపు పది వేల బస్తాల ధాన్యం వచ్చింది. వరి (1010) రకం 2,613 బస్తాలు రాగా వాటికి సగటున రూ.2,383 ధర వచ్చింది. అలాగే ఆర్‌ఎన్‌ఆర్ 7,283 బస్తాలు రాగా గరిష్టంగా రూ.2,384, కనిష్టంగా రూ.1,860 ధర పలికింది.

జలం.. పాతాళం

అడుగంటిన భూగర్భ జలాలు

- జిల్లాలో 11.81 మీటర్లకు పడిపోయిన నీటిమట్టం
- రెండు నెలల వ్యవధిలో 2.6 మీటర్లు తగ్గుదల
- గతేడాది సాధారణానికి మించి వర్షం కురిసినా విచిత్ర పరిస్థితులు
- చెరువులు, కుంటలు వెలవెల



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా తగ్గుముఖం పడుతున్నాయి. పెరిగిన నీటి అవసరాలకు తోడు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండటంతో ఈ ప్రభావం భూగర్భజలాలపై కనిపిస్తుంది. రెండు నెలల వ్యవధిలో ఏకంగా 2.6 మీటర్ల లోతులోకి పడిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఫలితంగా బోరుబావులు వట్టిపోతున్నాయి. దీంతో రైతాంగం బోర్లను బంద్ చేస్తూ ఆందోళన చెందుతున్నారు. హన్వాడ మండలంలో ఏప్రిల్ నాటికి ఏకంగా 21.25 మీటర్ల లోతులోకి నీటి ఊటలు పడిపోయాయి. ఏడాదంతా విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు, కుంటల్లో నీరు ఉన్నప్పటికీ భూగర్భ జలాలు తగ్గడం గమనార్హం.

బోరు మోటార్లతో తోడేస్తున్నారు

యాసంగి పంటల కోసం బోరు మోటార్లు నిరంతరం నీటిని ఎత్తిపోస్తున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 47 ఫీజో మీటర్ల నివేదికల సమాచారాన్ని భూగర్భ జలశాఖ ఈ నెలలో విడుదల చేసింది. జిల్లాలో వానాకాలం సీజన్ సీజన్‌లో సాధారణం కంటే అధికంగా వర్షాలు కురిసినా ఆశించినస్థాయిలో భూగర్భ నీటిమట్టం పెరగలేదు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుండటంతో రైతులు బోర్ల కింద అధికంగా పంటలు సాగు చేస్తున్నారు. అంతేకాకుండా గృహ అవసరాలకు కూడా నీటి వినియోగం పెరిగిపోయింది. దీంతో భూగర్భ జలమట్టం పడిపోయి యాసంగిలో సాగు చేసిన వరి పంటలు నీరందక ఎండిపోతున్నాయి. ప్రస్తుతం భానుడు భగ్గుమంటున్న తరుణంలో 40–42 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భూగర్భజలాలు అత్యంత వేగంగా పడిపోవడానికి ఎండ తీవ్రత కూడా ఒక కారణమని చెప్పవచ్చు.

కారణాలు ఇవే..

- జిల్లాలో పడిపోయిన భూగర్భ జలమట్టంతో వ్యవసాయ బోరుబావులు ఏకధాటిగా నడిపితే 80 శాతం బోరుబావులు ఖాళీ అవుతున్నాయి.
- ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా బోరు వేస్తే 90 శాతం విఫలం అవుతున్నాయని భూగర్భ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
- వాల్టా చట్టం అమలులో అధికారుల నిర్లిప్తత కారణంగా విచ్చలవిడిగా బోరుబావులు తవ్విస్తున్నారు.
- వాగులు, వంకల నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు.

హన్వాడలో 21.25 మీటర్ల లోతులోకి...

జిల్లాలో గతేడాది భారీ వర్షాలే కురిశాయి. 17 మండలాల్లోనూ సాధారణ వర్షపాతానికి మించి వర్షం కురిసింది. జూన్ నుంచి అక్టోబర్ వరకు 500.1 మి.మీ., వర్షానికి 908.1 మి.మీ., వర్షపాతం అంటే సగటు కంటే 82 శాతం ఎక్కువ వర్షం కురిసింది. ఫిబ్రవరిలో 9.21 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉంటే.. మార్చిలో 11.06 మీటర్ల లోతులోకి చేరాయి. రోజుల వ్యవధిలోనే 2.6 మీటర్ల మేర నీటి మట్టం తగ్గిపోయింది. అలాగే మార్చిలో 11.06 మీటర్ల లోతులో నీరు ఉండగా, ఏప్రిల్ 11.81 లోతులోకి చేరుకుంది. నెల వ్యవధిలో –0.75 మీటర్ల మేర మట్టం తగ్గడం ఆందోళన కలిగిస్తుంది. ఎండల తీవ్రత మరింత పెరిగితే భూగర్భ జలాలు ఇంకా పడిపోయే అవకాశం ఉంది.


కొత్తగా బోరుబావులు తవ్వించొద్దు



జిల్లాలో భూగర్భ జలాలు రోజురోజుకు పడిపోతూనే ఉన్నాయి. తాగునీటికి అత్యవసరం అనుకుంటే మినహా బోరుబావి తవ్వించొద్దు. భూగర్భంలోని నీటి పొరల్లో నీటి లభ్యత తగ్గిపోవడంతో బోరుబావుల ద్వారా నీరు రావడం నిలిచిపోతుంది. దీనికి తోడు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అందరూ నీటి పొదుపు చర్యలు పాటించాలి. వర్షం నీటిని ఒడిసిపట్టుకోవాలి. ఇంకుడుగుంతలు, కందకాల తవ్వకం ద్వారా భూగర్భంలోకి పంపించాలి. సాగు భూముల్లో నీటి కుంటలు నిర్మించుకుంటే మంచిది.

– రమాదేవి, జిల్లా భూగర్భ జల శాఖ అధికారి

జిల్లాలో మూడు నెలల్లో భూగర్భ జలాలు (మీటర్లలో..)





కోయిలకొండలో ఫీజోటర్‌ను పరిశీలిస్తున్న అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ ధీరజ్‌కుమార్

ప్రమాద ఘంటికలు

జిల్లాలోని పలు మండలాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. భూగర్భజల శాఖ అధికారులు విడుదల చేసిన గ్రౌండ్ వాటర్ రిపోర్టును పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తోంది. హన్వాడ మండలంలో నీటి వినియోగం అతిగా ఉండటంతో భూగర్భ జలాలు అడుగంటాయి. ఇక్కడ మార్చిలో 17.84 మీటర్ల లోతులో జలాలు ఉండగా, ఏప్రిల్‌లో –3.41 మీటర్ల లోతులోకి పడిపోయాయి. బాలానగర్ మండలంలో మార్చిలో 15.07 మీటర్ల లోతులో జలాలు ఉండగా, ఏప్రిల్‌లో 17.57 మీటర్లకు చేరుకుంది. –2.49 మీటర్లు లోతులోకి జలాలు పడిపోయాయి.

- ఒకవైపు దంచి కొడుతున్న ఎండలు.. మరోవైపు రోజురోజుకూ పెరుగుతున్న నీటి అవసరాలతో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. బోర్లు, బావులు ఎండుతున్నాయి. చెరువులు, వాగులు ఎడారిని తలపిస్తున్నాయి. జిల్లాలోని కోయిలకొండ, నవాబుపేట, హన్వాడ, గండేడ్, మహమ్మదాబాద్ తదితర మండలాల్లో 550 ఫీట్ల వరకు బోరు వేసినా చుక్క నీరు రావడం లేదు. అనుమతి లేకుండా బోర్లు వేయొద్దని అధికారులు సూచిస్తున్నా కొందరు బేఖాతర్ చేస్తున్నారు.

జిల్లాలో నీటిమట్టం పడిపోయిన వివరాలు (మండలాల వారీగా.. మీటర్లలో)

మండలం	మార్చి	ఏప్రిల్	పడిపోయిన జలం
హన్వాడ	17.84	21.25	-3.41
బాలానగర్	15.07	17.57	-2.49
మూసాపేట	5.58	7.99	-2.41
నవాబుపేట	15.89	17.74	-1.85
కోయిలకొండ	13.59	15.33	-1.74
జడ్చర్ల	12.05	12.76	-0.71
కౌకుంట్ల	4.22	4.84	-0.63
మహబూబ్‌నగర్ అర్బన్	6.02	6.60	-0.58
రాజాపూర్	8.13	8.63	-0.51
మిడ్జిల్	10.65	11.16	-0.50
చిన్నచింతకుంట	8.03	8.48	-0.45
మహమ్మదాబాద్	6.74	7.06	-0.33
అడ్డాకుల	5.42	5.68	-0.26
భూత్పూర్	5.83	5.86	-0.03
గండేడ్	18.66	18.30	0.36
మహబూబ్‌నగర్ రూరల్	10.00	8.30	- 1.70
దేవరకద్ర	12.28	9.63	2.65

ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన వయోవృద్ధులు, వికలాంగులు

మహబూబ్‌నగర్ రూరల్: వృద్ధులు, దివ్యాంగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. బుధవారం అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయంలో మొదటిసారిగా వృద్ధులు, దివ్యాంగుల కోసం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రతినెలా మొదటి బుధవారం నిర్వహించే ప్రత్యేక ప్రజావాణిలో తమ తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని అన్నారు. తమ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో 38 మంది దరఖాస్తులను స్వీకరించారు. సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న కొన్ని సమస్యలను కలెక్టర్ దృష్టికి తేగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఓ జోజప్ప, నగర పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, డీడబ్ల్యూఓ జరీనాబేగం, తహసీల్దార్ ఘాన్సీరాంనాయక్, ఎల్‌డీఎం భాస్కర్, ఎక్సైజ్ అండ ప్రొహిబిషన్ అధికారి నర్సింహారెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు నాగభూషణం, బాలయ్య, మనోహర్‌రావు, రాజసింహుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

- కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మండల ప్రత్యేక అధికారులు ఎంపీడీఓలు, ఎంపీఓలు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులతో మండలాల వారీగా తాగునీటి సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పైపులైన్ లీకేజీలు, డ్యామేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. సీసీ కుంట మండలంలో 13 హ్యాబిటేషన్‌లలో వనపర్తి జిల్లా రామనపాడు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ లీకేజీ, తదితర కారణంగా గ్రిడ్ వాటర్ తక్కువగా వస్తుందని కలెక్టర్ దృష్టికి రాగా.. నీటి సరఫరా మెరుగుపరచాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. అడ్డాకుల మండలంలో బలీద్‌పల్లి, కన్ననూర్‌లో వనపర్తి వాటర్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ ద్వారా మే 15 లోగా తాగునీటి సరఫరా మెరుగుపర్చాలన్నారు. మిషన్ భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకులు, గేట్‌వాల్స్, పాత మోటార్లు ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తిచేయాలన్నారు. ప్రతి ఇంటికి నీటి కొరత లేకుండా నీరు అందేలా చూడాలని, మోటార్లు మరమ్మతులు ఉన్న చోట నీటి కొరత లేకుండా ట్యాంకర్లు, బోర్‌వెల్ బావులు వంటివి ఏర్పాట్లు చేయాలన్నారు. ఏమైనా ప్రతిపాదనలు ఉంటే పంపించాలని వెంటనే మంజూరు చేస్తామన్నారు. ప్రత్యేకాధికారులు రోజు వారి విధులతో పాటు ఎక్కడ తాగునీటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మిషన్ భగీరథ ఎస్ఈ జగన్మోహన్, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, డీపీఓ పార్థసారథి, డీఆర్‌డీఓ నర్సింహులు, మిషన్ భగీరథ గ్రిడ్ ఇన్‌చార్జి ఈఈ శ్రీనివాస్, ఇంట్రా ఈఈ పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలమర్రిలో ఏర్పాట్లు

- ఈనెల 16న రానున్న మిస్‌వరల్డ్ పోటీదారులు
- మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులు



పిల్లలమర్రిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రపంచ సుందరి పోటీల్లో భాగంగా ఈనెల 16న జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రిని విదేశీ పర్యాటకుల బృందం సందర్శించనుంది. దీంతో ఈనెల 2 నుంచి ఇక్కడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ ప్రాంతం మొత్తం ఎక్కడా చెత్తాచెదారం లేకుండా సుమారు 25 మంది కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అలాగే 500 చదరపు గజాల విస్తీర్ణంలో లాన్ (కార్పెట్ గ్రాస్) ఏర్పాటు చేస్తున్నారు. ఆహ్లాకర వాతావరణం ఉట్టిపడేలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వీటిని బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. మరోవైపు మెట్టుగడ్డ (ఎన్‌హెచ్–167) నుంచి మొదలుకొని పిల్లలమర్రి వరకు గల విశాలమైన రోడ్డుకు ఇరువైపులా మొక్కలను పెంచుతున్నారు. వీటి మధ్య పెరిగిన పిచ్చిమొక్కలను సైతం తొలగిస్తున్నారు.

నంబర్ ప్లేట్ మార్చాల్సిందే..

అచ్చంపేట: నకిలీ నంబర్ ప్లేట్లను అరికట్టడం, రహదారి భద్రతలపై సుప్రీంకోర్టు తీర్పు అనుసరించి అన్ని రకాల వాహనాలకు హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేటు(హెచ్ఎస్ఆర్‌పీ) తప్పనిసరి చేస్తూ.. రవాణాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం 2019 ఏప్రిల్ 1వ తేదీ కన్నా ముందు కొనుగోలు చేసిన వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ లేకుంటే ఇకపై రోడ్డుపై నడిపేందుకు అవకాశం లేదు. కాలపరిమితి ముగిసిన వాహహనాల నంబర్ ప్లేట్ల పైనా నిబంధనలు పక్కాగా అమలు చేసేందుకు జిల్లా రవాణాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అన్ని రకాల పాత వాహనాలకు ఇప్పుడున్నవి కాకుండా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను అమర్చుకోవాలని రవాణాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీనికి తుది గడువు సెప్టెంబర్ 30గా ప్రకటించింది. లేని పక్షంలో భారీ జరిమానాలు, శిక్షలు వేసేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. వీటిని అమర్చుకునేందుకు ప్రత్యేక రుసుములు ప్రకటించారు. వాహనాల తీరు ఆధారంగా ధరలు నిర్ణయించింది. నకిలీ నంబర్ ప్లేట్లకు అడ్డుకట్ట వేయడంతో పాటు రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకొని రవాణాశాఖ కఠిన నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించింది.

పటిష్ట చర్యలు

నిర్దేశిత గడువు నిండిన వాహనాలు రోడ్డుపై నడపకుండా ఉండేందుకు రవాణాశాఖ పటిష్ట చర్యలు తీసుకుంటుంది. 15 సంవత్సరాల కాలపరిమితి ముగిసిన వాహనాలను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. నిర్ణీత కాల పరిమితి ముగిసిన వాహనాలు వేర్వేరు నంబర్ ప్లేట్లపై రోడ్డుపై తిరుగుతూ ప్రమాదాల కారణం అవుతున్నాయి. అనేక వాహనాలకు సకాలంలో సామర్థ్యం పరీక్షలు చేయడం లేదు. ఇలాంటి వాటికి అడ్డుకట్టు పడనుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2018 డిసెంబర్ 31 నాటికి 6,01,677 వాహనాలు ఉండగా 2019 జనవరి 1 నుంచి 2025 ఏప్రిల్ 30 వరకు 3,68,574 వాహనాలతో మొత్తం 9,65,761 వాహనాలు ఉన్నాయి. ఐదు జిల్లాల రవాణాశాఖ కార్యాలయాల పరిధిలో నిత్యం పదుల సంఖ్యలో వాహనాల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. సాధారణ నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలు 4 లక్షలకు పైగానే ఉంటాయని సమాచారం. ఈ వాహనదారులంతా తప్పనిసరిగా హెచ్ఎస్ఆర్ ప్లేట్లు బిగించుకోవాల్సి ఉంటుంది. లేదంటే వాహనాలకు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, కాలుష్య నిరాధరణ పత్రాల వంటి తదితర సేవలను నిలిపివేస్తారు. వాటిని అమ్మాలన్నా.. కొనాలన్నా ఇబ్బందులు తప్పవు. ఆర్‌టీఏ అధికారుల తనిఖీల్లో పట్టుబడితే కేసులు నమోదు చేసి జరిమానా వేయడం లేదా వాహనాలు సీజ్ చేయడం చేస్తారు.

పాత వాహనాలకు హైసెక్యూరిటీ

- ఉత్తర్వులు జారీ చేసిన రవాణాశాఖ
- 2019 కంటే ముందు కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరి
- సెప్టెంబర్ 30 వరకు తుది గడువు
- నకిలీ నంబర్ ప్లేట్ల కట్టడి.. రహదారి భద్రతే లక్ష్యం



పాత వాహనాలకు అమర్చుకోవాలి

పాత వాహనాలకు కొత్తగా హై సెక్యూరిటీ నంబర్ ప్లేటు అమర్చుకోవాలి. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రకారం వాహనాలకు ఫీజును నిర్ధారించారు. 15 ఏళ్లు దాటిన వాహనాలకు మరో 5 ఏళ్లు గడువు పొడిగించాలంటే వాహనదారుడు నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే దానికి బార్‌కోడ్ వస్తోంది. అప్పుడు వాటికి హైసెక్యూరిటీ నంబర్ల ప్లేటు అమర్చుకోవాల్సి ఉంటుంది. తనిఖీలో పట్టుబడితే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తాం. వాహనాలకు ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సేవలు నిలిపివేస్తాం.

– చిన్నబాలు, రీజినల్ ట్రాన్స్‌పోర్టు అధికారి, నాగర్‌కర్నూల్

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌కు చెల్లించే రుసుములు ఇలా..

ద్విచక్రవాహనం 320-360	కార్లు 590-700
త్రిచక్రవాహనాలు 350-450	కమర్షియల్ వాహనాలు 600-800

నంబర్ ప్లేట్ మార్పు ఇలా..

పాత వాహనానికి కొత్తగా హైసెక్యూరిటీ నంబర్ ప్లేటు పొందాలంటే వాహనదారుడే నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్ఐఏఎం.ఇన్ అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి వాహనం నంబర్, ఫోన్‌నంబర్, వాహన రకం, కంపెనీ, జిల్లా తదితర వివరాలు నమోదు చేయాలి. నంబర్ ప్లేట్ షోరూం వివరాలు వస్తాయి. వెంటనే ఆ షోరూంకు వెళ్లి వాహనానికి అమర్చుకొని ఫొటోను తీసి మరోసారి వెబ్‌సైట్‌లో ఎంటర్ చేయాల్సిన బాధత వాహనదారుడిపైనే ఉంటుంది. ఇదిలాఉండగా, నిరక్షరాస్యులు, స్మార్ట్‌ఫోన్‌లు లేని వాహనదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

2018 డిసెంబర్ 31వ తేదీకి ముందు వాహనాల వివరాలిలా..

జిల్లా	బైక్‌లు	కార్లు	ఆటోలు	గూడ్స్	ట్రాక్టర్లు/ట్రైలర్లు	ఇతర వాహనాలు
మహబూబ్‌నగర్	2,70,491	26,069	14,585	9,872	19,493	433
వనపర్తి	37,407	6093	2,415	3,845	6,678	2,424
నాగర్‌కర్నూల్	41,291	6,893	3,610	4,391	9,770	342
గద్వాల	58,956	4,856	1,648	3,267	6,811	218
నారాయణపేట	40,059	4,953	3,135	2,700	8,823	149

2019 జనవరి నుంచి 2025 ఏప్రిల్ వరకు కొనుగోలు చేసిన వాహనాలు

జిల్లా	బైక్‌లు	కార్లు	ఆటోలు	గూడ్స్	ట్రాక్టర్లు/ట్రైలర్లు	ఇతర వాహనాలు
మహబ్‌బ్‌నగర్	84,061	13,548	5,873	4,310	7,917	163
వనపర్తి	36,767	4,376	1,968	2,114	7,373	01
నాగర్‌కర్నూల్	47,797	6,225	1,947	3,416	15,093	78
గద్వాల	56,329	4,199	697	2,101	6,803	44
నారాయణపేట	42,405	3,719	2,409	1,423	5,404	44

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నవాబుపేట: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కామారం శివారులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. మండలంలోని సిద్దొటం గ్రామానికి చెందిన కోస్గి వెంకటయ్య (70) కామారం శివారులో హర్షవర్ధన్‌రెడ్డి మామిడి తోటలో కూలీ పని చేస్తుండేవాడు. కాగా మంగళవారం తోటలో పనిచేసి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు యజమానికి సమాచారం అందించి బుధవారం తోటలో వెతికారు. తోటలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వెంకటయ్య షాక్‌కు గురై మృతి చెంది కనిపించాడు. దీంతో మృతుడి భార్య కోస్గి బుచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

ఆగిన ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం


కంసాని రాజు

ఊట్కూరు: మండల కేంద్రానికి చెందిన కంసాని రాజు (40) ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ నిలిచి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి ఊట్కూరు గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. ఊట్కూరులోని శ్రీరాంనగర్ వీధికి చెందిన కంసాని రాజు సింగారం చౌరస్తాలోని హోటల్‌లో పనిచేసి జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి పని ముగించుకొని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా గ్రామ శివారులో వడ్లలో లోడ్‌తో నిలిచి ఉన్న టాక్టర్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణంరాజు తెలిపారు. మృతుడికి నలుగురు ఆడపిల్లలు ఉన్నారు.

రైలు కింద పడి కూలీ మృతి

మరికల్: మద్యం మత్తులో ప్రమాదవశాత్తు రైలు కింద పడి చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన కూలీ మృతి చెందిన ఘటన బుధవారం పస్పుల శివారులో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన బుడ్డు (26) కొంత కాలంగా మరికల్ మండలంలోని పస్పులలో ఓ బోర్‌బండిపై పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యం తాగి రాత్రి సమయంలో పస్పుల శివారులో ఉన్న రైలు పట్టాల పైకి వెళ్లగా ఎదురుగా వచ్చిన గూడ్స్ రైలు ఢీకొని శరీరం రెండు భాగాలుగా విడిపోయి చెల్లాచెదురుగా పడిపోయింది. బుధవారం ఉదయం గమనించిన సమీప పొలాల రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి వెళ్లి బోర్‌బండిపై పని చేస్తున్న కూలీ మృతదేహంగా గుర్తించి యాజమాని శేఖర్‌రెడ్డి సమాచారం ఇచ్చారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మహబూబ్‌నగర్ రైల్వే పోలీసులు రామకృష్ణ తెలిపారు.

తల్లి ఒడిలో నుంచి బాబు కిడ్నాప్


శ్రీహరి(ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: తల్లితో పాటు ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఏడాది వయసు కలిగిన బాబు ఉదయం చూసే వరకు కన్పించకుండా పోయాడు. టూటౌన్ ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామానికి చెందిన కందూర్ అరుణ నాలుగు నెలల నుంచి కూతురు అక్షిత, సంవత్సరం వయసు కలిగిన శ్రీహరి అనే బాబుతో పాటు జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో ఉంటుంది. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి ఇద్దరూ పిల్లలతో కలిసి అరుణ రైల్వేస్టేషన్ ఫుట్‌పాత్‌పై నిద్రపోయింది. ఉదయం 5గంటల ప్రాంతంలో చూసుకోగా ఏడాది బాబు కన్పించలేదని బాధితురాలు తల్లి అరుణ ఫిర్యాదు చేశారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 137(2) బీఎన్ఎస్ కింద కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనాల ఢీ.. యువకుడి మృతి

అయిజ: మండలంలోని కిస్టాపురం, వెంకటాపురం గ్రామాల మధ్య బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మరణించాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డేపల్లి మండలం తనగల గ్రామానికి చెందిన త్రివేణు, శివ, రవి ముగ్గురు ద్విచక్రవాహనంపై తనగల గ్రామం నుంచి వెంకటాపురానికి వెళ్తున్నారు. అదే సమయంలో తనగల గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీరామనాయకుడు బైక్‌పై వెంకటాపురం నుంచి తనగలకు బయలుదేరారు. ఈ క్రమంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో త్రివేణు అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీరామ్ నాయుడుకి తీవ్ర గాయాలు కాగా రవి, శివలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను కర్నూలు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

బైపాస్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్


కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి (ఫైల్)

- త్వరలోనే రోడ్డు నిర్మాణం కోసం సర్వే
- బైపాస్ పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు చెక్..

జడ్చర్ల టౌన్: ఎన్నో ఏళ్లుగా జడ్చర్ల పట్టణ వాసులు ఎదురుచూస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమ వుతున్నాయి. 44వ, 167వ నెంబర్ల జాతీయ రహదారులను అనుసంధానం చేసేలా బైపాస్ నిర్మాణం చేపట్టనున్నారు. నాలుగురోజుల క్రితం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని స్థానిక ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు డీకే అరుణతో కలిసి బైపాస్ రోడ్డు గూర్చి వినతిపత్రం సమర్పించారు. దాదాపు ఏడాది క్రితం మంత్రి కోమటిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి బైపాస్ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మళ్లీ ఇప్పుడు ఎంపీ డీకే అరుణతో కలిసి మరోమారు వినతిపత్రం సమర్పించారు. ఈ సారి కేంద్ర మంత్రి బైపాస్‌కు పచ్చజెండా ఊపారని ఎమ్మెల్యే ప్రకటించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ముఖ్యంగా 44, 167వ నంబర్ల జాతీయ రహదారులు ఇదే కేంద్రం నుంచి వెళ్తున్నాయి. వనపర్తి రాష్ట్ర రహదారి 23 సైతం ఇక్కడి నుంచే వెళ్తోంది. పోలేపల్లి ఫార్మసెజ్ కారణంగా వివిధ రాష్ట్రాల నుంచి బతుకుదెరువుకోసం వచ్చేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీంతో నియోజకవర్గ కేంద్రంలో విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. 2018లోనే బైపాస్ నిర్మాణం కోసం అప్పటి ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ఇదే క్రమంలో 167వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభం కావటంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య రెట్టింపైంది. సిగ్నల్‌గడ్డపై 750మీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు నెమ్మదిగా సాగటం వల్లే 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ఒక కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. అదే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం ఎమ్మెల్యేగా అనిరుధ్ రెడ్డి గెలవటం జరిగాయి. గెలిచిన తొలినాళ్లలోనే కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి బైపాస్‌రోడ్డు ఆవశ్యకతను వివరించారు. మంత్రి అప్పట్లోనే సానుకూలంగా స్పందించినప్పటికీ ముందుకు సాగలేదు. ఇన్నాళ్లకు తిరిగి బైపాస్ గూర్చి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతో కలిసి ఎమ్మెల్యే మరోమారు కేంద్ర మంత్రిని కలిసి బైపాస్ గూర్చి విన్నవించారు. అందుకు ఆయన పచ్చజెండా ఊపారు.

బైపాస్‌కు కేంద్ర మంత్రి సానుకూలం

బైపాస్ రోడ్డు మంజూరు చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతో కలిసి కేంద్ర మంత్రికి విన్నవించాం. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. వాస్తవానికి జడ్చర్లకు బైపాస్ ఎప్పుడో కావాల్సి ఉంది. 4కి.మీ. మేర రోడ్డు నిర్మాణం జరిగితే నియోజకవర్గకేంద్రం జడ్చర్లలో ట్రాఫిక్ సమస్య తీరుతుంది. త్వరితగతిన నిధులు మంజూరైతే పనులు జరిగేలా కృషిచేస్తా.

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

4 కి.మీ. మేర రహదారి

44వ జాతీయ రహదారి నుంచి 167వ జాతీయ రహదారిని కలిపేలా మొత్తం 4నుంచి 4.5 కి.మీ. మేర బైపాస్‌రోడ్డు వేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న కావేరమ్మపేట నుంచి శిఖర్‌గానిపల్లి మీదుగా గంగాపురం వద్ద రహదారులను కలిపేలా ప్రతిపాదనలు ఉన్నాయి. మరోవైపు దివిటిపల్లి నుంచి తాటిపర్తి మీదుగా ఆలూరు నుంచి బూర్గుపల్లి మీదుగా నాగసాల గంగాపురం వరకు మరో ప్రతిపాదన ఉంది. రెండింటిలో ఒకటి ఆమోదించే అవకాశాలున్నాయి. బైపాస్ నిర్మాణం జరిగినట్లయితే రైల్వే లైన్‌పై బ్రిడ్జ్ నిర్మాణం సైతం చేపట్టాల్సి ఉంటుంది. అందుకు దక్షిణమధ్య రైల్వే శాఖ అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. బైపాస్ రోడ్డు అయితే జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలు పట్టణంలోకి రాకుండా నేరుగా వెళ్తాయి. దీనివల్ల ట్రాఫిక్ సమస్య సగం వరకు తీరే అవకాశం ఉంటుంది. బైపాస్ నిర్మాణానికి రూ.300 నుంచి 400 కోట్లు అవసరం కానున్నాయి.

ఓం నమఃశివాయ..


వీరభద్రస్వామి దేవాలయంలో అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

నవాబుపేట: ఓం నమఃశివాయ.. ఓం వీరభద్రయా.. అంటూ నిప్పు కనికలపై నడిచి భక్తి పారవశ్యంతో పరవశించారు భక్తులు. వీరబద్రస్వామి దేవాలయంలో ఏటా నిర్వహించే ఉత్సవాలలో భాగంగా బుధవారం మండల పరిధిలోని లోకిరేవు వీరబద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. ఈ క్రమంలో పలువురు భక్తులు అగ్ని గుండంలో నడిచి భక్తిని చాటుకున్నారు. నాడు దక్ష యజ్ఞం వీరభద్రుడు యజ్ఞం సందర్భంగా అగ్నిలో దూకి వీరంగం సృష్టించిన నేపథ్యంలో దేవాలయంలో అగ్ని గుండం ఏర్పాటు చేశారు. ఈ వేడుకను తిలకించేందుకు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సైతం శివ భక్తులు పెద్దఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గ్రామంలో పుర వీధుల గుండా ఏర్పాటు చేసిన రథోత్సవం సైతం అందరిని ఆకట్టుకుంది. అలాగే శివభక్తుల సేవా కార్యక్రమంలో ఖడ్గాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం గురుస్వాములకు ఘన సత్కారం చేసి రథయాత్రలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పూజారి లింగయ్య, వీరభద్రయ్యస్వామి అర్చక సంఘం రాష్ట్ర నాయకులు వీరన్న, నర్సింహాచారి, వెంకటయ్య, పద్మయ్య, రాజు, మాజీ సర్పంచ్ వెంకటేష్, శ్రీనివాస్, నరేష్, ఆంజనేయులు, రవి, యాదయ్యలు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో వీరభద్రుడు


లోకిరేవులో రథోత్సవం

డబ్బుల వ్యవహారంలో మహిళ దారుణ హత్య


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మహిళతో డబ్బుల విషయంలో ఏర్పడిన గొడవలో ఓ వ్యక్తి సదరు మహిళను గొంతు నులిమి హత్య చేశాడు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ హత్య తాజాగా వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని దొడ్డలోనిపల్లికి చెందిన శాంతమ్మ (35) ఒంటరిగా జీవనం సాగించేది. ఈ క్రమంలో ఆమెకు నవాబ్‌పేట మండలం తీగలపల్లికి చెందిన కృష్ణయ్యతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఐదేళ్లుగా ఇద్దరు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. అయితే డబ్బుల వ్యవహారంలో గత కొన్ని రోజులుగా ఇద్దరు గొడవ పడేవారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం కూడా గొడవ జరగగా కృష్ణయ్య, శాంతమ్మను గొంతు నులిమి హత్య చేసి పారిపోయాడు. ఇంట్లో మంచంపై పడి ఉన్న శాంతమ్మ మృతదేహన్ని స్థానికులు బుధవారం గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ గాంధీనాయక్ పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

జోగుళాంబ సన్నిధిలో ఎమ్మెల్సీ అద్దంకి



అలంపూర్: దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను రాష్ట్ర ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సతీసమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జోగుళాంబ అమ్మవారి బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించారు.

రక్త కన్నీటి గాథ..!

- రక్త పిపాసి తలసేమియా
- విలువైన వైద్యం చేయించుకోలేక అవస్థలు పడుతున్న బాధితులు
- ఉమ్మడి జిల్లాలో 179మంది
- నేడు ప్రపంచ తలసేమియా, రెడ్‌క్రాస్ దినోత్సవం



పాలమూరు: కొందరు చిన్నారులు తల్లిపాలు తాగే వయస్సులో రక్తాన్ని ఎక్కించుకుంటూ తల్లడిల్లుతున్నారు. బడికి వెళ్లాల్సిన సమయంలో రక్తనిధి కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చాక్లెట్లు చప్పరించాల్సిన నోటితో చేదు మందు బిల్లలు తింటున్నారు. తోటి చిన్నారులు ఆనందంగా ఆడుకుంటుంటే చూస్తూ ఉండటం తప్ప ఏమి చేయలేని నిస్సహాయస్థితి వారిది. అలసట, ఆయాసాల మధ్య ప్రాణాంతక వ్యాధి తలసేమియా బాధితుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. ఉమ్మడి జిల్లాలో 179 మంది చిన్నారుల సంతోషాన్ని ఇది దూరం చేస్తోంది. అయితే వారి ఆయుష్షు పెంచే బాధ్యతను జిల్లా జనరల్ ఆస్పత్రి, రెడ్‌క్రాస్ తీసుకుంది.

రక్తం ఎక్కించాల్సిందే..

తలసేమియా జన్యు సంబంధిత వ్యాధి. వ్యాధి సోకిన వారికి వారం, పదిహేను రోజులకు ఒకసారి రక్తాన్ని ఎక్కించాల్సిందే. లేకపోతే వారి ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి ఉంది. ఈ వ్యాధిగ్రస్థుల్లో హిమోగ్లోబిన్ ఉత్పత్తి శరీరానికి అవసరమైనంత ఉండదు. ఒకవేళ ఉత్పత్తి అయినా ఎక్కువ కాలం ఉండదు. 2018లో తలసేమియాను ఆరోగ్యశ్రీ పథకంలో విలీనం చేయడం వల్ల బాధితులకు ప్రతి నెల మందులను జనరల్ ఆస్పత్రి నుంచి ఇస్తుంటే.. రక్తం మాత్రం రెడ్‌క్రాస్ నుంచి అందిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు..

తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే అవకాశం ఉంది. చిన్నారులు ఎదుగుతున్న కొద్దీ వ్యాధి బయటపడుతుంది. వ్యాధి బారినపడిన పిల్లలకు రక్తహీనత మొదలై జీర్ణశక్తి మందగిస్తుంది. ముఖం పాలిపోవటం, ఎదుగుదల లేకపోవడం, హుషారు తగ్గడం, నీరసించి పోవడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. కీళ్ల నొప్పులు, కడుపు నొప్పి ప్రారంభమై, మూత్రం పసుపు వర్ణంతో వస్తోంది.

పరీక్షలు చేయించు కోవాలి

ఈ వ్యాధి బారిన పడినవారు పసుపు రంగులో మూత్ర విసర్జన చేస్తుండటం వల్ల దీనిని తల్లిదండ్రులు పచ్చ కామెర్లుగా భావిస్తుంటారు. అవగహన లేమి కారణంగా పచ్చ కామెర్లకు చికిత్స అందిస్తారు. పైలక్షణాలు పిల్లల్లో ఉంటే జనరల్ ఆస్పత్రిల్లో పూర్తిస్థాయి పరీక్షలు చేయించి చికిత్స చేయించుకోవాలి.

బావిలో పడి ఉపాధి హామీ కూలీ మృతి

కొత్తకోట: నాటవెల్లి గ్రామ శివారులో రోజువారీ ఉపాధి హామీ పనులకు వెళ్లి బోయ పద్మ(45) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. అధికారులు, ఉపాధి కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. బోయ పద్మ ఎప్పటిలాగే ఉపాధి కూలికి వచ్చిందని, ఈ క్రమంలో తాగునీటి తెచ్చేందుకు బావి వద్దకు వెళ్లిందన్నారు. కానీ చాలా సేపటి వరకు పద్మ తిరిగి పని ప్రదేశానికి రాకపోవడంతో అనుమానం వచ్చి మిగతా కూలీలు బావి దగ్గరకు వెళ్లారు. కానీ అప్పటికే బావిలో పద్మ మృతదేహం నీటిపై తేలియాడుతూ ఉండడం చూసి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నీరు తేవడానికి బావిలోకి దిగుతుండగా కాలు జారి నీటిలో పడి ఉండొచ్చని కూలీలు తెలిపారు. ఘటనపై ఉపాధి కూలీల మండల అధ్యక్షుడు నాగారపు బీచుపల్లి స్పందిస్తూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వరికోత మిషన్ ఢీకొని ఇద్దరికి గాయాలు

పాన్‌గల్: వరికోత మిషన్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు ప్రొహిబీషన్ ఎస్‌ఐ హిమాబిందు బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తకోట మండలం విలియంకొండతండాకు చెందిన ముడావత్ శంకర్, గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన మాసుం ఇద్దరు కలిసి ఓ ఫంక్షన్ ఫొటోలు తీసేందుకు బైక్‌పై ఈనెల 6న కొల్లాపూర్‌కు వెళ్లారు. వారు అదే రోజు అర్ధరాత్రి తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా మండలంలోని అన్నారంతండా సమీపంలో మలుపు వద్ద వనపర్తి నుంచి వస్తున్న వరికోత మిషన్ డ్రైవర్ శంకర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ముడావత్ శంకర్‌కు కుడికాలు, కుడిచేతికి ఫ్యాక్చర్ కాగా.. మాసుంకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని జిల్లా ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం మాసుంను హైదరాబాద్‌కు సిఫార్సు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన వరికోత మిషన్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గాయపడిన ముడావత్ శంకర్ బావ ఆంజనేయులు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి


సాగు చేసిన వరి పంట


చదును చేసిన పంట పొలం

పాడి-పంట

గద్వాల జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: పొలంలో నిరంతరం పంట మార్పిడి చేయడం ద్వారా భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సక్రియానాయక్ సూచించారు. ఒకే పంటను ఏళ్ల తరబడిగా సాగు చేయడం ద్వారా చీడపీడల తాకిడి అధికమవుతుందని, భూమి సైతం నిస్సారంగా మారుతుందన్నారు.

ఎంపికలో జాగ్రత్తలు

పంట మార్పి చేయాలంటే అంతకు ముందు వేసిన పంటకు భిన్నంగా పెరిగే పైరును ఎంచుకోవాలి. కొన్ని పంటల వేరు వ్యవస్థ నేలలోని పొరల నుంచి పోషకాలని ఎక్కువగా గ్రహిస్తుంది. కాబట్టి పోషకాలను ఎక్కువగా గ్రహించే నువ్వులు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న వంటి పంటలకు బదులుగా భూమికి పోషకాలను సమకూర్చే అపరాల పంటలు సాగు చేస్తే మంచి ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. అపరాల పంటలు కరువు పరిస్థితులను తట్టుకోవడంతో పాటు ఆకులు రాల్చి భూమికి సేంద్రియ పదార్థాన్ని అందిస్తాయి. అపరాల పైరు మీద ఉండే బుడిపెలు వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. నల్ల రేగడి నేలల్లో సోయాచిక్కుడు వేసుకుంటే పైరు కోత సమయానికి ఆకులు పూర్తిగా రాలుతాయి. తద్వారా ఎకరానికి ఒకటి నుంచి రెండు టన్నుల సేంద్రియ పదార్థం లభిస్తుంది.

ఇలా చేసుకోవచ్చు

వానాకాలంలో వేరుశనగ వేసుకోనే రైతులు తర్వాత వచ్చే యాసంగిలో మొక్కజొన్న పంట వేసుకుంటే పైరుకు కొంత నత్రజని ఎరువు లభిస్తోంది.

- కంది, శనగ పైర్లను వరుసగా సాగు చేస్తే కాయ తొలుచు పురుగుల తాకడి అధికంగా ఉంటుంది. అందువల్ల ఈ పురుగులు తక్కువగా ఆశించే జొన్న, సోయాచిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ, మొట్ట వరి వంటి పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. వరితో పంట మార్పిడి చేసుకుంటే వేరుశనగ పైరుకు నులిపురుగుల బెడద తగ్గుతుంది.
- వరుసగా పొద్దుతిరుగుడు పంటను సాగు చేసే వారు కొర్ర, జొన్న, సజ్జ వంటి చిరుధాన్యాపు పంటలను లేదా కంది, శనగ, మినుము వంటి అపరాల పైర్లు లేదా వేరుశనగతో పంట మార్పిడి చేసుకోవచ్చు.
- వంగ తోట వేసిన రైతులు కాలీఫ్లవర్‌తో పంట మార్పిడి చేసుకుంటే వంగకు ఎండు తెగులు సోకదు. టమాట, ఆవాలు, బంతి, ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేస్తే నులి పురుగుల ఉధృతి తగ్గుతుంది.
- దోస, కాకర, గుమ్మడి, పొట్ల, బీర, బూడిద గుమ్మడి, దొండ వంటి తీగ జాతి కూరగాయల పంటలను వరి పైరుతో పంట మార్పిడి చేసుకోవాలి.
- ఉల్లి సాగు చేసే వారు ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి.
- ఒకసారి పసుపు సాగు చేసిన వారు రెండేళ్లపాటు భూమిలో పసుపు సాగు చేయకూడదు. ఒకవేళ సాగు చేస్తే చీడపీడల బెడద పెరిగి దిగుబడి తగ్గుతుంది. వరి, చెరకు, అరటి, తమలపాకు, కూరగాయల పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. పసుపు తర్వాత వరి, జొన్న వేసుకుంటే నులి పురుగుల ఉధృతి తగ్గుతుంది. కానీ మిరప, టమాట, క్యాబెజీ, దోస, గుమ్మడి, సోర, బీర, పత్తి, ఆవాలు, బెండ వేసుకోకూడదు.
- వరిని వరుసగా సాగు చేయకుండా పప్పు ధాన్యాలు, నునెగింజల పంటలు వేసుకోవాలి.
- మిరప, వేరుశనగ, క్యాబెజీ, పంటలను ఆశించే లద్దె పురుగుల తాకిడి అరికట్టాలంటే జొన్న, వరి, సజ్జ, రాగి, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలతో పంట మార్పిడి చేయాలి.